# 'కల్కి' సీక్వెల్ కోసం..



'కల్కి' చిత్రంతో అశ్వత్థామ పాత్రలో మెప్పించారు బిగ్‌బి అమితాబ్‌బచ్చన్. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌కు దేశవ్యాప్తంగా అద్భుతమైన ఆదరణ దక్కింది. దాంతో సీక్వెల్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సీక్వెల్‌కు సంబంధించిన కొంత భాగం షూటింగ్ పూర్తయింది. తాజా సమాచారం ప్రకారం మే నెలలో అమితాబ్ బచ్చన్ ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలిసింది. ఇటీవలే కౌన్ బనేగా కరోడ్‌పతి 16వ సీజన్‌ను పూర్తి చేసిన అమితాబ్ ఇక సినిమాలపై దృష్టి పెడుతున్నట్లు తెలిసింది. సీక్వెల్‌లో అమితాబ్ పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుందని, ఆయనపై కొన్ని కీలకమైన యాక్షన్ ఘట్టాలు కూడా ఉంటాయని చిత్ర సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కర్ణుడి పాత్రలో ప్రభాస్, అశ్వత్థామగా అమితాబ్.. ఇద్దరు కలిసి డెవిల్ యాస్కిన్ (కమల్‌హాసన్)పై చేసే పోరాటం సీక్వెల్‌లో హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు. జూన్ రెండోవారం వరకు అమితాబ్ సీక్వెల్ షూటింగ్‌లో పాల్గొంటారని సమాచారం.

# మైల్‌స్టోన్ మూవీకి రంగం సిద్ధమవుతుందా?



వంద సినిమాల్లో హీరోగా నటించడం సామాన్యమైన విషయం కాదు. గతంలో హీరోలు ఏడాదికి పదిపదిహేను సినిమాలు చేసే రోజుల్లో అది చెల్లుబాటైంది. ఇప్పుడున్న హీరోలకైతే అది తీరని కలే. ప్రస్తుతం లైమ్‌లైట్లో ఉన్న హీరోల్లో వంద సినిమాలు పూర్తి చేసిన హీరోలు చిరంజీవి, బాలకృష్ణ మాత్రమే. వారు కూడా తమ హయాంలో ఏడాదికి ఏడెనిమిది సినిమాలు చేశారు కాబట్టే అది సాధ్యమైంది. అయితే.. ఈ వరుసలో వందకు చేరువ కాగల హీరోలు ఇప్పటికీ ఇద్దరుముగ్గురున్నారు. వారిలో నాగార్జున ముందున్నారు. ఆయన ఇప్పటికే హీరోగా వందకు చేరువయ్యారు. ప్రస్తుతం కూలీ, కుబేర సినిమాలతో నాగ్ బిజీగా ఉన్నారు. వాటి తర్వాత మైల్‌స్టోన్ మూవీపై దృష్టి పెట్టనున్నారాయన. తమిళంలో 'నితమ్ వరు వానమ్' అనే ప్రేమకథను తెరకెక్కించిన రా.కార్తీక్ అనే కుర్ర దర్శకుడు ఇటీవలే నాగార్జునకు ఓ కథ వినిపించాడట. పూర్తిస్థాయి కమర్షియల్ అంశాలతో ఉన్న ఆ కథ తన వందవ సినిమాకు కరెక్ట్ అని నాగ్ భావించినట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం బౌండ్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేసే పనిలో రా.కార్తీక్ ఉన్నాడట. అక్కినేని నాగార్జున వందవ సినిమా అంటే.. అభిమానులకు అది నిజంగా ప్రతిష్టాత్మకమైనది. పక్కాగా హిట్ అవ్వాల్సిందే. మరి రా.కార్తీక్ ఎలాంటి కథ రాశాడో, ఈ బరువైన బాధ్యతను ఎలా మోస్తాడో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# ఫ్యామిలీమ్యాన్ ప్రతీకారం



చియాన్ విక్రమ్ కథానాయకుడిగా ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకత్వంలో 'వీర ధీర సూర' చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతున్నది. ఈ సినిమా రెండో భాగం మొదట విడుదల కానుండటం ఇక్కడ ఆసక్తికరమైన విషయం. ఈ నెల 27న రెండో భాగం విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు రైట్స్‌ని ఎన్.వి.ఆర్ సినిమా సొంతం చేసుకోగా, మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ నైజాం విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కుటుంబంతో కథానాయకుడికి ఉండే అనుబంధాన్ని ఈ టీజర్ ఆవిష్కరించింది. కథలోని ప్రతీకార నేపథ్యాన్ని కూడా టీజర్‌లో చూడొచ్చు. విక్రమ్ అద్భుతమైన నటనతో ఈ సినిమాలో ఆకట్టుకుంటారని, ఫ్యామిలీమ్యాన్‌గా, ప్రతీకారేచ్ఛతో రగిలిపోయే విధివంచితుడిగా విక్రమ్ నటన నెక్ట్స్ లెవల్లో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఎస్.జె.సూర్య, సూరజ్ వెంజరమూడు, దుషార విజయన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తేని ఈశ్వర్ ఐఎస్‌సీ, మ్యూజిక్: జి.వి.ప్రకాష్‌కుమార్, నిర్మాత: రియా శిబు



# సమంత నిర్మాణంలో శుభం

అగ్ర కథానాయిక సమంత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి ట్రలాలా పేరుతో ప్రొడక్షన్ హౌజ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ బ్యానర్‌పై తెరకెక్కించిన తొలి చిత్రం 'శుభం'చిత్రీకరణ పూర్తి చేసుకుంది. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ చిత్రానికి 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. హర్షిత్ మల్గిరెడ్డి, శ్రియ కొంథం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్ ప్రధాన పాత్రల్ని పోషించారు. ఈ కథలో కావల్సినంత వినోదంతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయని, అనూహ్య మలుపులతో ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. తమ సంస్థలో రూపొందించిన తొలి చిత్రం ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉందని సమంతా ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మృదుల్ సుజిత్ సేన్, రచన: వసంత్ మరిగంటి, దర్శకుడు: ప్రవీణ్ కండ్రేగుల.

# ఐటమ్‌గా శ్రీవిష్ణు?



హీరో శ్రీవిష్ణు స్పీడ్‌గా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు సినిమాలున్నాయి. వాటిలో ఒకటి గీతాఆర్ట్స్ నిర్మిస్తున్న 'సింగిల్' సినిమా. దీనికి కార్తీక్ దర్శకుడు. అలాగే 'మృత్యుంజయ్' అనే థ్రిల్లర్ సినిమా కూడా చేస్తున్నాడు శ్రీవిష్ణు. ఆ సినిమాకు దర్శకుడు హుస్సేన్ షా కిరణ్. ఇప్పుడు తాజాగా మూడో సినిమాక్కూడా ఆయన సైన్ చేసినట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. 'స్వాతిముత్యం'ఫేం లక్ష్మణ్ కె.కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారట. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే మొదలైందని, 'ఐటమ్' అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ కూడా కానిచ్చేస్తున్నారని తెలుస్తున్నది. దాదాపు ఈ టైటిలే ఫైనల్ కూడా కావొచ్చని సమాచారం. తన తొలి సినిమా 'స్వాతిముత్యం' మాదిరిగానే 'ఐటమ్' సినిమాను కూడా ఆద్యంతం వినోదాత్మకంగా దర్శకుడు లక్ష్మణ్ కె.కృష్ణ తెరకెక్కిస్తున్నారని వినికిడి. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. త్వరలో టైటిల్‌ని కూడా అనౌన్స్ చేస్తారట.

# రుణం తీర్చుకుంటున్న కార్తీ?



తమిళ అగ్ర హీరో కార్తీ.. రుణం తీర్చుకునే పనిలో ఉన్నారు. ఎవరి రుణం అనుకుంటున్నారా? ఆ వివరాల్లోకెళ్తే.. కార్తీ అన్నయ్య సూర్యను హీరోగా నిలబెట్టిన సినిమా అంటే టక్కున గుర్తొచ్చే పేరు 'కాఖా కాఖా'. గౌతమ్ వాసుదేవ మీనన్ ఆ సినిమాకు దర్శకుడు. 'కాఖా కాఖా' తర్వాత హీరోగా వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం సూర్యకు లేకపోయింది. ప్రస్తుతం సౌత్‌లో ఉన్న పానిండియా హీరోల్లో సూర్య ఒకరు. ఈ వైభవానికి కారణం 'కాఖా కాఖా'. ప్రస్తుతమైతే దర్శకుడిగా గౌతమ్ మీనన్ పరిస్థితి అంత బాలేదు. అందుకే ఆయన నటుడిగా బిజీ అయిపోయారు. రీసెంట్‌గా 'డ్రాగన్' సినిమాలో కూడా మంచి పాత్రలో మెరిశారు. అయితే.. మెగాఫోన్ మీద మమకారం మాత్రం ఆయనను వీడిపోలేదు. అందుకే.. ఇటీవల హీరో కార్తీకి ఓ కథ వినిపించారట. అది కూడా ఆయన కథ కాదు. జయమోహన్ అనే రచయిత రాసిన కథ. తనే స్క్రీన్‌ప్లే కూడా అందించారట. దర్శకుడు మాత్రం గౌతమ్ వాసుదేవ మీననే. కథ కార్తీకి బాగా నచ్చడంతో.. దర్శకుడిగా గౌతమ్ వాసుదేవ మీనన్ ప్రస్తుత పరిస్థితిని అస్సలు పట్టించుకోకుండా 'గోహెడ్' అంటూ పచ్చజెండా ఊపేశారట కార్తీ. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనున్నదని చెన్నయ్ వర్గాల సమాచారం. అన్నకు బ్రేక్ ఇచ్చిన రుణాన్ని తమ్ముడు ఇలా తీర్చుకుంటున్నాడన్నమాట.



# ఈ సినిమాకు నీతో పనిలేదు.. వెళ్లిపో

నయనతారని అభిమానులు 'లేడీ సూపర్‌స్టార్' అని ప్రేమతో పిలుచుకుంటూ ఉంటారు. నిజానికి శిఖరాగ్రాన ఉంటే కానీ 'సూపర్‌స్టార్' బిరుదు నటులకు రాదు. మరి ఆ బిరుదు నయన్‌ని వరించిందంటే.. తను అగ్రస్థానంలో ఉన్నట్టేకదా. దానికి తగ్గట్టే పారితోషికం విషయంలోనూ తోటి హీరోయిన్లకంటే ఎక్కువే డిమాండ్ చేస్తున్నారు నయనతార. ఇప్పుడిదంతా దేనికి? అంటే.. అంతటి స్టార్‌డమ్ ఉన్న నయనతార కెరీర్.. భయంకరమైన అవమానంతో మొదలయ్యిందట. ఆ విషయాన్ని తానే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. 'హీరో పార్థిబన్ డైరెక్ట్ చేస్తున్న సినిమాతో నేను హీరోయిన్‌గా పరిచయం కావాల్సింది. ఆడిషన్ చేసి మరీ ఆయన నన్ను కథానాయికగా తీసుకున్నారు. అయితే.. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల టైమ్‌కి లొకేషన్‌లో ఉండలేకపోయాను. తొలిరోజే లేట్‌గా రావడంతో 'ఈ సినిమాకు నీతో పని లేదు.. వెళ్లిపో..' అని ముఖంమీదే అనేశారు పార్థిబన్. అందరిముందూ ఆయన అలా అనడంతో మనసు చివుక్కుమంది. క్షమించమని అడిగే ధైర్యం కూడా చేయలేకపోయా. తల దించుకొని వెనక్కి వెళ్లిపోయా.' అంటూ గత చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు నయనతార. ఆ తర్వాత హరి దర్శకత్వంలో శరత్‌కుమార్ హీరోగా రూపొందిన 'అయ్యా' చిత్రం ద్వారా నయన్ తమిళతెరకు పరిచయం అయిన సంగతి తెలిసిందే.



# నటుడిగా డేవిడ్ వార్నర్ కొత్త అవతారం

హీరో నితిన్ నటించిన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయిక. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో ప్రత్యేక అతిథి పాత్ర పోషించటం విశేషం. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని డేవిడ్ వార్నర్ ఫస్టలుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. షార్ట్ హెయిర్ కట్‌తో ట్రెండీ దుస్తులు ధరించి, ఫుల్‌స్వాగ్‌తో డేవిడ్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సోషల్ మీడియాలో అద్భుతమైన ఫాలోయింగ్ ఉన్న డేవిడ్ వార్నర్ ప్రజెన్స్ ఈ సినిమాపై గ్రేట్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. త్వరలోనే సినిమా ట్రైలర్‌ని విడుదల చేయనున్నామని, అలాగే ప్రమోషనల్ టూర్‌ని కూడా నిర్వహించనున్నామని వారు తెలిపారు. డా.రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, కేతిక శర్మ, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

# ప్రసాద్ పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తాడు



'పెళ్లికాని ప్రసాద్' సినిమా చూశాను. మనస్సాక్షితో ఒక ప్రేక్షకుడిగా చెబుతున్నా. ఈ పరీక్షలో వందశాతం నాకు నేను మార్కులు వేసుకున్నాను. ఈ నెల 21న సినిమా చూశాక మీరూ మంచి మార్కులు వేస్తారని నమ్ముతున్నా. నాతోపాటు మిగతా నటీనటులంతా ఈ సినిమాలో చేసిన హడావిడీ అంతా ఇంతా కాదు. పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తుందీ సినిమా.' అని నటుడు సప్తగిరి అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకుడు. కె.వై.భాను ప్రకాష్‌గౌడ్, సుక్కా వెంకటేశ్వర్‌గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మాతలు. అగ్ర నిర్మాత దిల్‌రాజు నేతృత్వంలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ ఈ నెల 21న చిత్రాన్ని విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సప్తగిరి మాట్లాడారు. 'ఇందులో మురళీగౌడ్‌గా మంచి కామెడీ చేస్తా. దర్శకుడి అభిరుచి, నిర్మాతల రాజీలేనితనం వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. దిల్‌రాజుగారు ఈ సినిమాను విడుదల చేస్తుండటంతో సినిమాకు మంచి బజ్ క్రియేటైంది.'అని ఆనందం వెలిబుచ్చారు సప్తగిరి. ఇంకా దర్శకుడు అభిలాష్‌రెడ్డి, నిర్మాత కేవై బాబు, కథానాయిక ప్రియాంకశర్మ, సీనియర్ నటి అన్నపూర్ణ, నటి ప్రమోదిని కూడా ఈ సమావేశంలో మాట్లాడారు.



# యాక్షన్ మోడ్‌లో మోగ్లీ..

యువహీరో రోషన్ కనకాల నటిస్తున్న లవ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మోగ్లీ 2025'. 'కలర్‌ఫొటో' ఫేం సందీప్‌రాజ్ దర్శకుడు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. శనివారం హీరో రోషన్ కనకాల పుట్టినరోజు సందర్భంగా అతనికి శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాకు చెందిన ఓ కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. మాస్‌లుక్‌తో సీరియస్‌గా చూస్తూ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు రోషన్. అతని పాత్ర స్వభావాన్ని ఈ పోస్టర్ చెప్పకనే చెబుతున్నది. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామ మారుతి ఎం., సంగీతం: కాలభైరవ.

# జ్ఞాపకాలను వెతుక్కుంటూ..



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కవితాత్మక ప్రేమకథ 'కాలమేగా కరిగింది'. శింగర మోహన్ దర్శకుడు. మరే శివశంకర్ నిర్మాత. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్‌ని గమనిస్తే.. ఫణి, బిందు అనే ఇద్దరు టీనేజర్ల ప్రేమకథ ఇదని తెలుస్తున్నది. వారి పాత్రల్లో స్వచ్ఛమైన ప్రేమ, అమాయకత్వం గోచరిస్తున్నది. ప్రేమే లోకంగా కలహాలే లేని ప్రేమికులుగా ఉన్న వారిద్దరినీ కాలం విడదీసింది. దాంతో ఆ జ్ఞాపకాలను వెతుక్కుంటూ చివరకు వారిద్దరూ ఎలా కలిశారు? అనేదే ఈ కథ అని ట్రైలర్ చెబుతున్నది. ఈ చిత్రానికి కెమెరా: వినీత్ పబ్బతి, సంగీతం: గుడప్పన్, నిర్మాణం: సింగార క్రియేటివ్ వర్క్స్.

